పంటలపై.. పొగ మంచు

- మామిడి పూతకు నష్టం
- అపరాల పంటలదీ ఆదే పరిస్థితి
- కంది పంటకు ఇబ్బందే..





ఎల్.ఎన్.పేట: దట్టంగా కురుస్తున్న పొగ మంచు (ఇన్‌సెట్లో) పొగమంచు కారణంగా మాడిపోతున్న మామిడి పూత

ఎల్.ఎన్.పేట: గత వారం, పది రోజులుగా కురుస్తున్న పొగ మంచుతో పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పలు రకాల పంటలు పూత దశకు వచ్చినప్పుడు పడుతున్న పొగ మంచు కారణంగా పూత మాడిపోతోంది. మామిడి పూతతోపాటు అపరాల పంటలైన పెసర, మినుము పూతకు నష్టం కలుగుతోంది. ఆలస్యంగా పూతకు వచ్చిన కంది పంటదీ అదే పరిస్థితి.



పాతపట్నం: తీమర సమీపంలో పెసర పంటపై కురుస్తున్న మంచు

ఉదయం 9 గంటల వరకు వర్షంలా..

ఉదయం 8 నుంచి 9 గంటల వరకు పొగ మంచు పడుతూనే ఉంటోంది. సూర్యుడు కనిపించనంత దట్టంగా మంచు కురవటంతో ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలి పనులకు వెళ్లేవారు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు.. ఇలా అన్ని వర్గాల వారు మంచుతో పాటు చలి పెరగటంతో ఇబ్బంది పడుతున్నారు.

పాతపట్నం నియోజకవర్గంలో పండ్ల తోటలు, అపరాలు, కంది పంట సాగు (ఎకరాల్లో) వివరాలు ఇలా..

మండలం	ఎల్.ఎన్.పేట	పాతపట్నం	హిరమండలం	కొత్తూరు	మెళియాపుట్టి
కంది	145	190	60	190	225
తోటలు	205	450	185	250	275
అపరాలు	3,825	6,200	2,350	7,150	7,450

మంచుతో నష్టం



అపరాల పంటలైన పెసర, మినుము ఆశాజనకంగా ఉన్నాయి. కొన్నిచోట్ల ప్రస్తుతం పూత దశకు వచ్చాయి. ప్రస్తుతం కురుస్తున్న మంచు కారణంగా పూతకు వచ్చిన పంటంతా నల్లగా మారిపోతుంది. పూత రాలిపోవడంతోపాటు చిన్న దోమ చేరి నష్టం జరుగుతుంది. పంటను కాపాడుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నాం.

– బొడ్డేపల్లి రాజరత్నం, రైతు, తురకపేట, ఎల్.ఎన్.పేట

మామిడి పూత మాడిపోతోంది



ఇటీవల కురిసిన వర్షాలకు మామిడి పూత ఆలస్యంగా వచ్చింది. ప్రస్తుతం కొన్ని రకాల మామిడి పూత వచ్చే సమయం. గత వారం రోజులుగా కురుస్తున్న మంచు కారణంగా మామిడి పూతంతా మాడిపోతోంది. ఈ ఏడాది మామిడి పంటను దక్కించుకోలేమని ఆందోళనగా ఉంది.

– పాలక పట్టయ్య, రైతు, జంబాడ, ఎల్.ఎన్.పేట

ప్రారంభించేది ఎప్పుడు?



నరసన్నపేట మండలంలోని మాకివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పథకం ద్వారా గత ప్రభుత్వ హయాంలో రెండు తరగతి గదులను రూ.28 లక్షలతో నిర్మించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా వీటిని ప్రారంభించలేదు. ఈ స్కూల్లో 173 మంది విద్యార్థులు ఉండగా 1 నుంచి 8 తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతి గదుల కొరత ఉంది. విద్యార్థులను ఆరు బయట కూర్చోబెట్టి ఒక్కోసారి తరగతులు నిర్వహిస్తున్నారు. నిర్మాణం పూర్తయిన తరగతి గదులను వినియోగంలోకి తీసుకురావాలని సర్పంచ్ రావాడ మోహన్‌రావు, ఎంపీటీసీ యాళ్ల అప్పలనాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తిని ఉపాధ్యాయులు కలిసి భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని ఇదివరకే విన్నవించారు.

– నరసన్నపేట

ఆరోగ్యంపై యువత ఆసక్తి

- చిన్న పట్టణాల్లోనూ విస్తరిస్తున్న జిమ్ కల్చర్



పాతపట్నంలోని ఓ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న యువకులు

పాతపట్నం: ఆరోగ్యంతోపాటు ఫిట్‌నెస్, శరీర సౌష్టవానికి యువకులు జిమ్ బాటపడుతున్నారు. అధిక బరువును తగ్గించుకునేందుకు, ఉల్లాసాన్ని పొందేందుకు వ్యాయామం వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో పెద్ద పట్టణాలకే పరిమితమైన ఈ జిమ్ కల్చర్ నేడు పాతపట్నం వంటి చిన్న పట్టణాలకు పాకింది. యువత ఆసక్తిని గమనిస్తున్న కొందరు అన్ని సౌకర్యాలతో జిమ్‌లను ఏర్పాటు చేసి ఆధునిక పరికరాలను అందుబాటులో ఉంచుతున్నారు. పట్టణాలతోపాటు పల్లెలకు చెందిన విద్యావంతులు ఆరోగ్య పరిరక్షణపై మక్కువ చూపుతున్నారు. తక్కువ ఖర్చుతో జిమ్‌లో సభ్యత్వం లభించడంతో పాతపట్నం యువతతోపాటు చుట్టుపక్కల గ్రామీణ యువకులు వినియోగించుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో యువత జిమ్‌లో కుస్తీ పడుతున్నారు.

టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన



టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

సారవకోట: మండలంలోని అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజయాంబికా యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. సంఘం రజతోత్సవం, వివేకానంద జయంతి పురస్కరించుకుని జిల్లా స్థాయి టాలెంట్ టెస్టు ఏర్పాటు చేశారు. సారవకోట, పాతపట్నం, జలుమూరు, నరసన్నపేట, కోటబొమ్మాళి తదితర మండలాల్లోని 20 పాఠశాలల నుంచి 326 మంది విద్యార్థులు హాజరయ్యారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు కూడా నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి వివేకానందుడి జయంతి రోజున బహుమతులు అందజేయనున్నట్లు సంఘం అధ్యక్షుడు చల్లా ఆనందరావు తెలిపారు.

క్లుప్తంగా

అష్టావధానం..



అష్టావధానంలో పాల్గొన్న చంద్రశేఖర శర్మ, తదితరులు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం సంస్థాన ప్రాంగణంలో ఆదివారం ద్విగళ అష్టావధానం నిర్వహించారు. బంకుపల్లి రామచంద్రమూర్తి సంస్మరణార్థం ఆయన కుమారుడు రమేష్ శర్మ ఆధ్వర్యంలో అష్టావధానం ఏర్పాటు చేశారు. నుసరాపు చంద్రశేఖర శర్మ, రంప సాయికుమార్ శర్మలు అవధానులుగా హాజరయ్యారు. 16 మంది ప్రాస్నికులు పాల్గొని ప్రశ్నలు సంధించారు. తికమక ప్రశ్నలు వేసినా అవధానులు సమయస్ఫూర్తితో సమాధానాలు చెప్పడం ఆకట్టుకుంది. సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో గుమ్మా నగేష్, నుసరాపు గణపతి శర్మ మాట్లాడుతూ ఇటువంటి అష్టావధానాలను పట్టణాల్లోనే కాకుండా పల్లెల్లోనూ ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అవధానులు బులుసు అపర్ణ, పులఖండం శ్రీనివాసరావు, డాక్టర్ గొలివి మోహన్‌రావు, రామజోగి శర్మ, భమిడిపాటి గౌరీ శంకర్, రెడ్డి పద్మ, భాస్కరభట్ల బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ, ఎస్‌ఐ

సారవకోట: సంక్రాంతి రోజుల్లో గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు సూచించారు. సారవకోటలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. సంక్రాంతి సమయంలో జూదం, పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతి సమయంలో ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు ఇంటికి తాళాలు వేసుకుని పోలీస్ స్టేషన్లో తగిన సమాచారం అందించాలన్నారు. సంక్రాంతి పురస్కరించుకుని గ్రామాల్లో పూర్తిస్థాయి భద్రతా ఏర్పాట్లను చేపడతామన్నారు. మత్తు పదార్థాల రవాణా, అక్రమ మద్యం నిల్వలున్న వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎస్‌ఐ అనిల్‌కుమార్ ఉన్నారు.

సీసీ కెమెరాల పునరుద్ధరణ



అంతరాబ కూడలి జంక్షన్‌లో పునరుద్ధరించిన సీసీ కెమెరా

పాతపట్నం: ఆంధ్ర – ఒడిశా సరిహద్దులోని పాతపట్నం మండల కేంద్రంలో సీసీ కెమెరాలను స్థానిక పోలీసులు పునరుద్ధరించారు. ఇటీవల జాతీయ రహదారి పనుల్లో భాగంగా కెమెరాలు, కెబుల్ పాడైందన్నారు. రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద ఒకటి, ఆల్‌ఆంధ్రా రోడ్డు జంక్షన్‌లో మూడు, నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం జంక్షన్‌లో మూడు, పోలీసు స్టేషన్ వద్ద మూడు, ఆర్టీసీ కాంప్లెక్స్, అంతరాబ కూడలి, సెయింట్ ఆన్స్ స్కూల్, దువ్వారి వీధి బస్టాండ్ వద్ద ఒకటి చొప్పున సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల మార్గంతోపాటు ఒడిశా, మెళియాపుట్టి, టెక్కలి, శ్రీకాకుళం మార్గం వైపు కూడా నిరంతరం నిఘా ఉండేలా సీసీ కెమెరాలు అమర్చామన్నారు. ఈ కెమెరాల్లో నిక్షిప్తమైన సమాచారాన్ని నేరుగా సర్కిల్ కార్యాలయం, జిల్లా ఎస్పీ కార్యాలయానికి అనుసంధానం చేసినట్లు తెలిపారు.

నేటినుంచి నియోజకవర్గ స్థాయి గ్రిగ్స్ పోటీలు



మైదానాన్ని సిద్ధం చేయిస్తున్న వ్యాయమ ఉపాధ్యాయుడు

కొత్తూరు: ఈ నెల 6 నుంచి 8 తేదీ వరకు మండలంలోని నివగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పాతపట్నం నియోజకవర్గ స్థాయి గ్రిగ్స్ క్రీడా పోటీలు జరగనున్నాయి. పాఠశాల మైదానాన్ని సిద్ధం చేసినట్లు హెచ్‌ఎం సువ్వారి నిర్మల, పీడీ కోల రాజారావు ఆదివారం తెలిపారు. కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట, పాతపట్నం, మెళియాపుట్టి మండలాలకు చెందిన పలు పాఠశాలల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు హాజరవుతారన్నారు. అండర్–14 (జూనియర్), అండర్–17 (సీనియర్) విభాగాలుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. 6న జూనియర్, సీనియర్ విభాగాలకు చెందిన బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్, షటిల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పీడీ తెలిపారు. ఇదేరోజు బాలురుకు వాలీబాల్ పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీలను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభిస్తారన్నారు.

లక్ష తులసీ దళార్చన



నరసన్నపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గోదా సేవా మహిళా మండలి ఆధ్వర్యంలో లక్ష దళార్చన పూజలు నిర్వహించారు. 10 మంది అర్చకులు గోవింద నామాలతో తులసీ దళార్చన పూజలు చేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 2 గంటల వరకు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు, చామర్తి శ్రీనివాసాచార్యులు, రేజేటి సతీష్ కుమార్ ఆచార్యులు, సంపత్ కుమార్ ఆచార్యులు, మహేంద్ర సత్యరామన్ ఆచార్యులు పాల్గొన్నారు.

– నరసన్నపేట

ప్రకృతి వ్యవసాయానికి ఆదరణ



రైతులకు అవసరమైన విత్తనాలు ఏ సమయంలోనైనా లభ్యమయ్యేలా పరిశోధనలు జరుగుతున్నాయని జిల్లా ప్రకృతి వ్యవసాయం అదనపు జిల్లా ప్రాజెక్టు అధికారి నడిమింటి ధనుంజయరావు అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా హిరమండలం మండలంలోని కిట్టాలపాడులో విత్తన క్షేత్రాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయానికి ఆదరణ పెరుగుతోందన్నారు. ఎన్నోరకాల ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. ఎంటీ సూర్యనారాయణ, మోడల్ మేకర్స్ జగన్, సురేష్, నరసింహ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

– హిరమండలం

చిన్నారులకు భోగిపళ్లు



సారవకోట మండలంలోని అవలింగి జేబీటీ పాఠశాల ఆవరణలో ఆదివారం అవలింగి, బుడితి, చీడిపూడి గ్రామాల్లోని పలువురు చిన్నారులకు భోగిపళ్లు పోశారు. ఈ కార్యక్రమం పాఠశాల డైరెక్టర్ మోహన్‌గాంధీ ఆధ్వర్యంలో చేపట్టారు. హిందూ సంప్రదాయాలను కాపాడాలనే ఉద్దేశంతోపాటు సంక్రాంతి పురస్కరించుకుని ఇప్పటినుంచే పాఠశాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు డైరెక్టర్ తెలిపారు.

– సారవకోట

చలి.. పులి..



ఈ చిత్రం ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో పాతపట్నం మండల కేంద్రంలో చలికి మంట కాగుతున్న స్థానికులు. గత మూడు రోజులుగా చలి విజృంభిస్తోంది. అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదుతున్నాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే వణికిపోతున్నారు. పొగ మంచు, చలి గాలులతో గిరిజనులు, రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు.

– పాతపట్నం

రెచ్చిపోతున్న ఇసుకాసురులు !



భగీరథీపురం సమీపంలో ఇసుక తవ్వకాలు

హిరమండలం: ప్రజలకు ఉచితంగా ఇసుక అని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఇసుక విధానంలో పారదర్శకత పాటిస్తున్నామని ప్రకటనలు ఇస్తోంది. వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ఉచితం మాటున అక్రమార్కులు ఇసకను తరలించుకుపోతున్నారు. ముఖ్యంగా కూటమి నేతలు ఇసుక రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. హిరమండలం మండలంలో వంశధార నది అధికార పార్టీ నేతలకు కాసులు కురిపిస్తోంది. మండలంలోని నదీతీర గ్రామాలైన భగీరథిపురం, పిండ్రువాడ, అంబావల్లి, రెల్లివలస, అక్కరాపల్లిలో ఇసుకను తవ్వేస్తున్నారు. రోజుకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను అంబావల్లిలో డంపింగ్ చేస్తున్నారు. అక్కడనుంచి లారీల్లో తరలిపోతోంది. వంశధార నదికి సంబంధించి కరకట్ట గట్టును రెండు, మూడు చోట్ల తొలగించడం విశేషం. ఇసుక అక్రమ రవాణాపై గ్రామ, మండల స్థాయి అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిపెట్టాలని కోరుతున్నారు.



కరకట్టను ఇలా రోడ్డుగా మార్చేసిన వైనం



అంబావల్లిలో ఇసుక డంపింగ్ చేసే ప్రదేశం

9 నుంచి ఏపీఎల్ క్రికెట్ టోర్నీ

ఆమదావలస: ఈ నెల 9వ తేదీ నుంచి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏపీఎల్ సూపర్ సిక్స్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు టోర్నీ నిర్వాహకులు తమ్మినేని విద్యాసాగర్ (తంబి) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వాహణ బాధ్యతలు ఏపీఎల్ కమిటీ సభ్యులు సనపల మోహన్, కామినేని సంతోష్ కుమార్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. మ్యాచ్ ఆరు ఓవర్లు ఉంటుందని, 8 మంది ప్లేయర్స్‌తో పాల్గొనాలని అన్నారు. ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, బెస్ట్ బ్యాట్స్‌మన్‌కు రూ.2 వేలు, బెస్ట్ బౌలర్‌కు రూ.2 వేలు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 9491533123ను సంప్రదించాలని విద్యాసాగర్ కోరారు.

న్యాయవాదుల సందడి

ఆమదాలవలస: మండలంలోని గాజుల కొల్లివలస సమీపంలో గల సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద ఆమదాలవలస జ్యూడీషియల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మీ బాయ్ ఆధ్వర్యంలో ఆదివారం పిక్నిక్ నిర్వహించారు. బిజీగా ఉండే న్యాయవాదులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. చిన్నా, పెద్దా అందరూ కలిసి ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. చిన్నారులకు పలు ఆటల నిర్వహించారు. ఈ పోటీల్లో గెలిపొందిన వారికి బహుమతులను అందజేశారు. అందరూ కలిసి వనభోజనాలు చేశారు.

నిబంధనలు తప్పనిసరి



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

పొందూరు: ఆటో, కాబ్ డ్రైవర్లు తప్పనిసరిగా రహదారి భద్రతా నియమాలు పాటించాలని స్థానిక ఎస్‌ఐ వి.సత్యనారాయణ సూచించారు. స్థానిక ఆటో స్టాండ్ ఆవరణలో డ్రైవర్లతో ఆదివారం సాయంత్రం మాట్లాడారు. మితిమీరిన వేగం, అధిక లోడుతో వాహనాలను నడపవద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కేసులు తప్పవని హెచ్చరించారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలి



మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ గవర్నర్ ప్రసాద్

నరసన్నపేట: లయన్స్ క్లబ్ సేవలు మరింతగా విస్తరించాలని, పేదలకు సేవా కార్యక్రమాలు అందేలా కార్యక్రమాల రూపకల్పన చేయాలని లయన్ డిస్ట్రిక్ట్ 316–ఎ ఎన్.వి.బి.ఎస్.ఎస్.ప్రసాద్ అన్నారు. స్థానిక కామేశ్వరినగర్‌లోని బంగారు వర్తకుల సంఘ భవనంలో ఆదివారం లయన్ డిస్ట్రిక్ట్ క్లబ్ కేబినేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. మరింత మంది సభ్యులను చేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమణ సాహు, రీజియన్ చైర్మన్ ఊణ్ణ రంగనాథ్, కార్యదర్శి కలివరపు సాయిరాం, ట్రెజరర్ కోరాడ వైకుంఠరావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు దారుణం



మానవ హక్కుల సంఘం సభ్యుడు వెంకటరావు

సరుబుజ్జిలి: నగరి నియోజకవర్గంలో దళితులపై అవమానకరంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘం నేత, అఖిల భారత మానవ హక్కుల సంఘం సభ్యుడు రావాడ వెంకటరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దళిత జాతి హక్కులను కాలరాస్తూ వ్యహరిస్తున్న వారి పట్ల ప్రభుత్వం పూర్తిబాధ్యత వహించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దాడులకు గురైన బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు.

త్రినాథస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

సారవకోట: మండలంలోని వడ్డినవలస గ్రామంలో గల త్రినాథస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారికి ధనుర్మాసం పురస్కరించుకుని అర్చకులు మనోజ్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూల విరాట్‌ను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

విజ్ఞాన యాత్ర



శాలిహుండం బౌద్ధ స్థూపాల వద్ద విద్యార్థులు

పొందూరు: మండలంలోని తండ్యాం పంచాయతీ గూనానపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గురగుబల్లి మధుబాబు ఆదివారం తమ పాఠశాల విద్యార్థులను విజ్ఞానయాత్రకు తీసుకువెళ్లారు. నైరా వ్యవసాయ కళాశాల, ఒమరవల్లి ఉపాధ్యాయ శిక్షణ సంస్థ, శాలిహుండం బౌద్ధ స్థూపాలు, కళింగపట్నం బీచ్, శ్రీకూర్మం ప్రాంతాలను చూపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు చుక్కల తిరుపతిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.